
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 17 । మే । 2025



సోమశిలలో 47.187 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 47.187 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 5,730, ఉత్తర,దక్షిణ కాలువలకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.96,520
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,736
మూడు శాతం జీఎస్టీతో	రూ.8,998
నవర (8 గ్రాములు)	రూ.71,984

గరిష్టం/కనిష్టం
36.8 /28.8

వాతావరణం

జిల్లాలో శనివారం అక్కడక్కడ కొద్దిపాటి జల్లులు పడొచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 45 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం



మాట్లాడుతున్న సీహెచ్‌ఓల అసోసియేషన్ నాయకురాలు చంద్రకళ తదితరులు

నెల్లూరు (అర్బన్): తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని సీహెచ్‌ఓల అసోసియేషన్ జిల్లా నాయకురాలు చంద్రకళ అన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మూసేసి డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు 19 రోజులుగా నిరాహారదీక్షలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ మహిళలుగా తాము ఇన్ని రోజులుగా ఎర్రటి ఎండలో కూర్చుని నిరసన తెలుపుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తమ సమస్యలను తీర్చాలని ఎన్నో దఫాలుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు అర్జీలిచ్చామన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడం వల్లనే తాము రోడ్డెక్కామన్నారు. ఇప్పటి వరకు తాము శాంతియుతంగా నిరసన తెలిపామన్నారు. అయినా తమ బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంతి, రుబికా, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భానుమహేష్, జిల్లా కో ఆర్డినేటర్ ఆదిల్ పాల్గొన్నారు.

పిల్లల దత్తతకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు(పొగతోట): పిల్లల్ని దత్తత తీసుకునేందుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ సువర్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూట్ 6 నుంచి 18 ఏళ్లలోపు పిల్లలను దత్తత ఇస్తామన్నారు. అయితే పూర్తి వివరాలతో ఐసీడీఎస్ కార్యాల యంలోని బాలల సంరక్షణాధికారిని సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 79015 97318, 94408 14522 నంబర్లను ఫోన్ చేయాలని తెలియజేశారు.

స్కూళ్ల మదింపు.. పోస్టుల కుదింపు

జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియతో ఉపాధ్యాయ పోస్టులకు ఎసరు పెడుతున్నట్లు కనిపిస్తోంది. గతంలో ఉన్న పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా జిల్లాలో 673 మంది ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు డీఎస్సీలో ఖాళీలు చూపించారు. తాజాగా పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ తర్వాత డీఎస్సీలో చూపించిన పోస్టులకు దాదాపు సమాన స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ల సర్ ప్లస్ తేల్చారు. దీన్ని బట్టి ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించే అవకాశం కూడా లేదని స్పష్టమవుతోంది.

- 8 రకాలుగా పాఠశాలల విభజన.. వివరాలు గోప్యత
- ఏ స్కూల్లో ఏ పోస్టు ఉందో తెలియని వైనం
- 600కు పైగా స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్
- ఇక ఎస్జీటీలకు పదోన్నతులు హుళక్కే.. సబ్జెక్ట్ టీచర్ల కొరత
- డీఎస్సీలో 673 పోస్టులు ఖాళీ చూపిన అధికారులు

నెల్లూరు (టౌన్): జిల్లాలో ఉండే పాఠశాలలను 8 రకాలు కూటమి ప్రభుత్వం విభజించింది. మొత్తం 3,221 పాఠశాలలుగా లెక్కలు తేల్చారు. శాటిలైట్ స్కూల్లో ఎల్‌కేజీ, యూకేజీ, 1, 2 తరగతులు, ఫౌండేషన్ స్కూల్లో 1, 2 తరగతులు, ఎన్‌రోల్‌మెంట్ 45 కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్చి 1 నుంచి 5 తరగతులను ఏర్పాటు చేశారు. అప్పర్ ప్రైమరీలో 1–8 తరగతులు, హైస్కూల్స్‌ల్లో 1–10 వరకు, 6–10 తరగతులు, 1–5వ తరగతికి 45 లోపు పిల్లలు ఉన్న స్కూల్స్‌ను హైస్కూల్స్ బీపీఎస్‌లో 1–10 తరగతులు, 45 మంది పిల్లలు ఎక్కువగా ఉన్న హైస్కూల్ ఎంపీఎస్‌లో 1–10 తరగతులకు విద్యను అందించనున్నారు. ప్రస్తుతం హైస్కూల్ ప్లస్‌లను యథావిధిగా ఉంచారు.

తగ్గనున్న పోస్టులు

కూటమి ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ వల్ల జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు గండి పడనుంది. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో విద్యా చట్టం ప్రకారం 1:20 నిష్పత్తిలో ఉపాధ్యాయులు ఉండాలి. అయితే కూటమి ప్రభుత్వం ఈ నిబంధనలను పక్కన పెట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తోంది. అయితే 30 మంది పిల్లలకు ఒక టీచరు పోస్టును కూడా కేటాయించడం లేదని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియతో ఎస్జీటీ పోస్టులు కూడా భారీగా తగ్గే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

ఆత్మకూరులోని వెస్ట్ ఎంపీపీఎస్‌లో 150 మంది విద్యార్థులు ఉన్నారు. హెడ్‌మాస్టర్‌తోపాటు ఐదుగురు ఎస్జీటీలు ఉండేవారు. ప్రస్తుతం ఆ స్కూల్‌ను మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్పు చేయడంతో అక్కడ హెడ్‌మాస్టర్‌తోపాటు నలుగురు ఎస్జీటీలు, ఒక ఉర్దూ ఎస్జీటీని ఏర్పాటు చేశారు. అయితే ఆ నలుగురులో ఒకరిని సర్‌ప్లస్‌గా చూపించారు. ఈ స్కూల్‌లో ఉర్దూ మీడియం కానీ, సెక్షన్ కానీ, పోస్టు కానీ లేదు.

ముత్తుకూరులోని మెయిన్ ఎంపీపీఎస్‌లో 64 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య ప్రకారం హెడ్‌మాస్టరుతోపాటు నలుగురు ఎస్జీటీలను నియమించాలి. అయితే పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో హెడ్‌మాస్టరు, ముగ్గురు ఎస్జీటీ పోస్టులు మిగిలాయి. వీరిలో తెలుగు ఇద్దరు, ఉర్దూ ఒకరు ఉన్నారు.

పునర్ వ్యవస్థీకరణ అంతా గందరగోళం



కేఎన్నార్ మున్సిపల్ పాఠశాల

సర్‌ప్లస్‌గా ఎస్‌ఏలు

జిల్లాలో 600కు పైగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు సర్‌ప్లస్‌గా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారులు లెక్కలు తేల్చారు. కూటమి ప్రభుత్వం 117 జీఓను రద్దు చేస్తున్నామని చెప్పి 3 నుంచి 5 తరగతుల విద్యార్థులను మళ్లీ ప్రాథమిక పాఠశాలల్లోకి విలీనం చేయడం ద్వారా భారీగా స్కూల్ అసిస్టెంట్లు మిగులు తేలారు. దీంతో ఎస్జీటీ పోస్టులు కూడా భారీగా తగ్గనున్నట్లు తెలుస్తోంది. అయితే కూటమి ప్రభుత్వం డీఎస్సీలో జిల్లాలో 673 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు లెక్కలు తేల్చారు. పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో ఉపాధ్యాయులు మిగులు తేలడంతో డీఎస్సీల్లో అన్ని ఖాళీ పోస్టులు ఏ విధంగా ఉంటాయని పలువురు ప్రశ్నిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో ఇలా..

పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో సంబంధం లేకుండా విద్యాశాఖ ఇష్టారాజ్యంగా ఈ ప్రక్రియ చేపట్టడంతో అంతా గందరగోళంగా తయారైంది. ఏ పాఠశాలను ఏ విధంగా విభజించారో, ఆ పాఠశాలలో క్యాడర్, పోస్టుల వివరాలను విద్యాశాఖ గోప్యంగా ఉంచింది. పోస్టులను భారీగా తగ్గించే ప్రక్రియలో భాగంగానే పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టారనే ఆందోళన ఉపాధ్యాయుల్లో నెలకొంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓ 117 పేరిట పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టింది. ప్రాథమిక పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి వరకు ఉన్న విద్యార్థులను సమీపంలోని హైస్కూల్లోకి విలీనం చేశారు. 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచరు బోధించే విధంగా చర్యలు చేపట్టారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఈ విలీన ప్రక్రియ ఎంతో మేలు చేస్తుందని మేధావులు అభినందించారు. అయితే పాఠశాలల విలీన ప్రక్రియపై అప్పట్లో కూటమి నేతలు ఉపాధ్యాయులను రెచ్చగొట్టి, వారిలో భయాందోళనలు రేకెత్తించి ఈ విధానంపై తీవ్ర వ్యతిరేకతను సృష్టించారు. ఇప్పుడు అదే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పునర్ వ్యవస్థీకరణ పేరుతో పాఠశాలల విలీన ప్రక్రియను చేపడుతోంది.

జిల్లాలో విభజన అనంతరం పాఠశాలలు

కేటగిరీ	పాఠశాలల సంఖ్య
శాటిలైట్ స్కూల్స్	0
ఫౌండేషన్ స్కూల్స్	968
బేసిక్ ప్రైమరీ స్కూల్స్	1,187
అప్పర్ ప్రైమరీ స్కూల్స్	79
హైస్కూల్స్	288
హైస్కూల్ బీపీఎస్	74
హైస్కూల్ ఎంపీఎస్	31

పాఠశాల స్థాయి, క్యాడర్ స్ట్రెంథ్‌ను బహిర్గతం చేయాలి
సురేంద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఏపీటీఎఫ్



పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ వివరాలు బహిర్గతం చేయాలి. క్యాడర్ స్ట్రెంథ్, పాఠశాలలకు ఎన్ని పోస్టులు కేటాయించారో చెప్పాలి. వివరాలను గోప్యంగా ఉంచడం తగదు. అప్పీల్ చేసుకునేందుకు సమయం కూడా ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కుదరదు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు కూడా ఇష్టారాజ్యంగా కేటాయించారు. ఏమైనా అడిగితే యాప్ నిలిపివేశారని చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి పోస్టులను కేటాయించాలి.

ఎంఈఓల ద్వారానే పునర్ వ్యవస్థీకరణ
– బాలాజీరావు, డీఈఓ



అన్ని మండలాలకు సంబంధించి ఎంఈఓల ద్వారానే పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ చేపట్టాం. వారిచ్చిన వివరాల ప్రకారమే స్కూల్స్‌ను మార్పు చేశాం. ఇందుకు సంబంధించి నోడల్ అధికారులను కూడా నియమించాం. విద్యాశాఖ అధికారులు వివరాలను గోప్యంగా ఉంచారని చెప్పడం సరికాదు. పాఠశాల పేరు చెప్పి అక్కడ సమస్య ఏమిటో చెబితే ఎందుకు చేశారో చెబుతాం. నిబంధనల ప్రకారమే పునర్‌వ్యవస్థీకరణ చేపట్టాం.

మూల్యాంకనానికి అధ్యాపకులను కేటాయించండి

నెల్లూరు (టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనానికి అర్హత కలిగిన అధ్యాపకులను పంపాలని ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఆర్‌ఐఓ వరప్రసాదరావు శుక్రవారం సర్కులర్ జారీ చేశారు. ఈ నెల 19వ తేదీ నుంచి స్థానిక కేఏసీ జూనియర్ కళాశాలలో మూల్యాంకనం నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు ఎగ్జామినర్లుగా నియమించిన అధ్యాపకులను ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ రిలీవ్ చేసి పంపాలన్నారు. 19వ తేదీ నుంచి సంస్కృతం, తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మ్యాథ్స్, సివిక్స్, 21 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, కెమిస్ట్రీ, హిస్టరీ, బాటనీ, జువాలజీ, కామర్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి మూల్యాంకనం ప్రారంభమవుతుందని చెప్పారు. మూల్యాంకనానికి హాజరు కాని అధ్యాపకులు, రిలీవ్ చేయాలని కళాశాలల యాజమాన్యాలపై ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఏజెన్సీ మోసాలు మరిన్ని వెలుగులోకి

పారిశుద్ధ్య పనులు చేయించుకుని జీతాలివ్వని కాంట్రాక్టర్

నెల్లూరు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి), ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పారిశుద్ధ్య విభాగం.. అవినీతి మురికిమయంగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్ట్ పొందిన అవుట్ సోర్సింగ్ ఎజైల్ ఏజెన్సీ 'మోనార్క్'లా వ్యవహరిస్తోంది. పెద్దాస్పత్రి సూపర్ బాస్ అండతో పాకీ ఏజెన్సీ దోపిడీ అంతా ఇంతా కాదు. వారాంతపు సెలవులు ఇవ్వకుండా పని చేయించుకోవడం, రాకపోతే జీతాలు కోత విధించడం, పీఎఫ్ చెల్లించకుండా ఆ డబ్బులు జేబులో వేసుకుంటూ కార్మికుల కడుపులు కొడుతున్నారు.

- కార్మిక చట్టానికి వ్యతిరేకంగా వేతనాల్లో కోతలు
- పీఎఫ్ చెల్లించకుండా మరో దగా
- పుట్టిన తేదీల కోసం వేల రూపాయలు గుంజి ఫేక్ సర్టిఫికెట్లు
- డిప్యూటీ కలెక్టర్, పెద్దాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారికి ఫిర్యాదులు
- సాక్షి కథనంతో ఒక్కొక్కరుగా ముందుకొస్తున్న బాధితులు

నెల్లూరు (అర్బన్): జీజీహెచ్, ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్ట్ పొందిన అవుట్ సోర్సింగ్ ఎజైల్ ఏజెన్సీ అవినీతి, అక్రమాల్లో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. శుక్రవారం సాక్షిలో 'కార్మికుల పొట్ట గొడుతున్నారు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వచ్చి తమకు జరిగిన అన్యాయాలను చెప్పుకుంటున్నారు. చాకిరి చేయించుకుని జీతాలు ఎగ్గొట్టిన వైనం నుంచి ఫేక్ విద్యా సర్టిఫికెట్లు సృష్టించిన వరకు అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా పెద్దాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి అయిన డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు వెల్లువెత్తుతున్నాయి. పారిశుద్ధ్యం, సెక్యూరిటీ నిర్వహణకు ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.10 కోట్ల వరకు నిధులు కేటాయిస్తోంది. ఈ మేరకు తగినంత పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందిని నియమించాల్సి ఉండగా సదరు పెద్దాస్పత్రి సూపర్ బాస్ అరకొరగా సిబ్బందిని నియమించి నిధులు కాజేస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇక ఆస్పత్రిలో విధుల్లో సెక్యూరిటీ స్థానంలో పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తుండడం విశేషం. గత నాలుగేళ్లలో పారిశుద్ధ్య విభాగంలో జరిగిన కోట్లాది రూపాయిల కుంభకోణం వెలుగు చూడాలంటే ప్రభుత్వం తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపించాలని ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు కోరుతున్నారు.

ఈ పారిశుద్ధ్య కార్మికురాలి పేరు లలితమ్మ. ఈమె 8 ఏళ్లుగా పెద్దాస్పత్రిలో పని చేస్తోంది. అనారోగ్యంతో గతేడాది కొన్ని నెలలు విధులకు రాలేదు. తిరిగి ఈ ఏడాది మార్చి 7న విధుల్లో చేరింది. అయితే ఆ కార్మికురాలికి మార్చి, ఏప్రిల్ జీతాలు ఇవ్వలేదు. ఆస్పత్రిలో ప్రభుత్వం తరఫున పనిచేసే సూపర్‌వైజర్ వేసిన హాజరు రిజిస్టర్‌లో ఆమె సంతకాలు కూడా ఉన్నాయి. అయితే ఏజెన్సీ మేనేజర్ మాత్రం విధులకు హాజరు కాలేదంటూ జీతాలు ఎగ్గొట్టాడని ఆమె వాపోతోంది.



ఈయన పేరు ఎస్‌కే షబ్బీర్. 2014 నుంచి పెద్దాస్పత్రిలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఏజెన్సీ మేనేజర్‌కు అనుకూలంగా ఉన్న ఒకరిద్దరు ఆయన్ను తొలగించాలనే ఉద్దేశంతో సంబంధం లేని ఒక కేసులో ఇరికించారు. అయితే ఆ కేసులో ఆ సూపర్‌వైజర్‌కు క్లీన్‌చిట్ రావడంతో మళ్లీ డ్యూటీలో జాయిన్ అయ్యాడు. 2024 జూన్, జూలై నెలల్లో విధులు నిర్వర్తించినప్పటికీ ప్రభుత్వ సూపర్‌వైజర్ల రిజిస్టర్‌లో సంతకాలు చేసి ఉన్నప్పటికీ ఆయా నెలల జీతాలు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారు.



వేతనాల్లో కోతలు

కార్మిక చట్ట ప్రకారం విధుల్లో వారికి వారాంత సెలవులు, పండగ సెలవులు తప్పనిసరిగా కేటాయించాలి. కానీ ఆ రోజుల్లో కూడా వారితో పనులు చేయించుకుంటున్న పరిస్థితి ఇక్కడ ఉంది. ఒక వేళ ఆరోగ్యం బాగోలేకపోయినా, అత్యవసరమై సెలవు పెట్టినా ఆ రోజు జీతం కోత విధిస్తున్నారు. దీనికంటే ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే.. కార్మికులకు మధ్య, మధ్యలో కొన్ని నెలలు జీతాలు ఎగ్గొట్టేస్తున్నారు. ఇదంతా పెద్దాస్పత్రి సూపర్ బాస్‌తో కలిసి సదరు పారిశుద్ధ్య ఏజెన్సీ నిర్వాహకుల నిర్వాకం.

రికార్డులు మాయం

కార్మికులు ఎదురు తిరిగి ప్రశ్నించడంతో కాంట్రాక్ట్‌కు సంబంధించిన హాజరు, ఇతర రికార్డులు హాస్పిటల్లో లేకుండా మాయం చేశారు. రికార్డులను తారు మారు చేస్తున్నారని తెలుస్తోంది. ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నప్పటికీ పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్ మౌనంగా ఉండడంతో ఏజెన్సీ నిర్వాహకుల అవినీతి, అక్రమాలు మితిమీరాయనే ఆరోపణలు ఉన్నాయి.



డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డికి అర్జీ ఇస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ప్రజాప్రతినిధులకు విలువేది

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తన నియోజకవర్గం నుంచి ఎస్.సునీతను పెద్దాస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికురాలిగా కాంట్రాక్ట్ ఉద్యోగం ఇచ్చేలా సదరు ఏజెన్సీకి సిఫార్సు చేశారు. వారు ఎమ్మెల్యే సూచన మేరకు విధుల్లోకి తీసుకున్నారు. డిసెంబర్ 2024 నుంచి పనిచేస్తున్నా 5 నెలలుగా ఏదో కారణం చెబుతూ జీతం ఇవ్వలేదు. మరి ఆ కార్మికురాలు ఎలా బతకాలో సంస్థకే తెలియాలి. ఇలా పనిచేస్తూ కొన్ని నెలలుగా జీతాలు పొందలేని వారిలో సూపర్‌వైజర్ సాయి నిఖిల్‌తోపాటు మాజీ మేయర్ భానుశ్రీ చేర్పించిన సుప్రజ, సెక్యూరిటీలో సుధాకర్, భరత్ దాదాపు 14 మంది వరకు ఉన్నారు.

విచారణ జరిపిస్తాం

పీఎఫ్ జమ చేయించేందుకు స్టడీ సర్టిఫికెట్లు ఇప్పిస్తామంటూ కొంత మంది కార్మికుల దగ్గర లంచాలు వసూలు చేసినట్లు నాకు ఫిర్యాదులు వచ్చాయి. పీఎఫ్ జమ కాలేదంటూ తెలిపారు. దీనిపై లోతుగా విచారిస్తాం. జీతాలు ఇవ్వని వారి గురించి విచారిస్తాం. తప్పు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– మహేశ్వరరెడ్డి, డిప్యూటీ కలెక్టర్, పెద్దాస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి

ఫేక్ విద్యార్హత సర్టిఫికెట్లతో మోసం

పెద్దాస్పత్రి, మెడికల్ కళాశాలలో 223 మంది పారిశుద్ధ్య కార్మికులు, 137 మంది సెక్యూరిటీ సిబ్బంది పని చేస్తున్నారు. వీరిలో పలువురికి పీఎఫ్ తమ ఖాతాల్లో జమ కావడం లేదు. ఎందుకు జమ కావడం లేదని ప్రశ్నిస్తే మీకు పుట్టిన తేదీ లేదు. ఏదైనా చదువుకున్న సర్టిఫికెట్, పాస్‌పోర్టు లాంటివి ఇస్తే.. అప్పుడు పీఎఫ్ జమ చేస్తామని ఏజెన్సీ మేనేజర్ స్పష్టం చేశాడు. అవి సరి చేసేందుకు అంటూ కొంత మంది దగ్గర రూ.13 వేలు, మరి కొంత మంది దగ్గర రూ.15.వేలు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సర్టిఫికెట్ అవసరమైన వారికి ప్రకాశం జిల్లా దొనకొండ జెడ్పీ హైస్కూల్లో చదివినట్లు అక్కడి హెడ్మాస్టర్ సంతకాలను ఫోర్జరీ చేసి ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి కార్మికులకు ఇచ్చారు. ఇది జరిగి ఏడాదైనాప్పటికీ ఇప్పటికీ కార్మికుల ఖాతాల్లో పీఎఫ్ నగదు జమ లేదు. ఇలా తమ వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేశారంటూ ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డికి సురేఖ, కృష్ణవేణి, అమల అనే మహిళలు ఫిర్యాదు చేశారు.

కార్మికులకు ఇచ్చిన ఫేక్ విద్యా సర్టిఫికెట్లు



అక్రమ ఇసుక, మైనింగ్‌ను అరికట్టాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు

- కేసులకు భయపడేది లేదు
- రౌడీలను, గూండాలను పెంచి పోషిస్తున్న అధికార పార్టీ నేతలు
- జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయి
- సరిదిద్దకపోతే ఉద్యమిస్తాం
- ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి, మేరిగ, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి

నెల్లూరు (అర్బన్): కూటమి ప్రభుత్వంలో జిల్లాలో అక్రమంగా సాగుతున్న మైనింగ్, ఇసుక తవ్వకాలను అరికట్టి ప్రజాధనాన్ని కాపాడాలని ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సైదాపురం మండలంలో అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా సాగుతుందన్నారు. ప్రభుత్వ ఆస్తిని దౌర్జన్యంగా కొల్లగొట్టుతున్నారన్నారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదన్నారు. బినామి పేర్లతో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారు ఎంత పెద్ద వారైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. కలెక్టర్‌గా జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమాలు ఇలాగే కొనసాగితే కేంద్ర ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన రోజు నుంచే జిల్లాలోని ఇసుక, క్వార్ట్జ్, సిలికాలను టీడీపీ నేతలు యథేచ్ఛగా దోచుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సోమశిల దిగువ నుంచి ఇందుకూరుపేట వరకు పెన్నానదిలో అడుగడుగునా ఇసుక రీచ్‌ల నుంచి అక్రమంగా అర్ధరాత్రి తరలిస్తున్నారన్నారు. వీటిని నియంత్రించేందుకు ఎవరైనా ప్రయత్నం చేస్తే గంజాయి బ్యాచ్‌లు, రౌడీలు, గూండాలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. నగరంలో కూడా టీడీపీ నాయకులు అసాంఘిక శక్తులను విచ్చల విడిగా పెంచి పోషిస్తున్నారన్నారు. రెండు నెలల్లోనే జరిగిన 20 హత్యలే ఇందుకు నిదర్శనమని విమర్శించారు. గంజాయి, మద్యం మత్తులో ఈ దారుణాలు జరుగుతున్నాయన్నారు. హంతకులకు అండగా అధికార పార్టీ నాయకులు నిలబడడం సిగ్గు చేటన్నారు. పోలీసు శాఖ సైతం ఏమి చేయలేక చేతులెత్తేసిందని విమర్శించారు. జిల్లాలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపించారు. రాబోయే రోజుల్లో టీడీపీ చేసే అక్రమాలపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు బనాయించినా భయపడేది లేదని, సామాన్యుల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు.

ముమ్మరంగా బీట్ ద హీట్

- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో అందరూ భాగస్వామ్యం కావాలి
- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా ప్రతి మూడో శనివారం నిర్వహిస్తున్న బీట్ ద హీట్ కార్యక్రమంపై ప్రజలకు ముమ్మరంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఆనంద్ ఈ మేరకు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్, మున్సిపాల్టీల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో విరివిగా మొక్కలు నాటడంతోపాటు 6 నెలల పాటు సంరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రైల్వే గేట్ల వద్ద షెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నగర కమిషనర్ నందన్ తెలిపారు. భవనాలపై రూఫ్ టాప్ గార్డెన్ ఏర్పాటు చేసుకునేలా మెప్మా గ్రూపు సభ్యులకు అవగాహన కల్పించాలని మెప్మా పీడీకి సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు వడదెబ్బ బారిన పడకుండా హెల్త్ క్యాంపులు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓకు సూచించారు. పక్షులు, పశువుల కోసం నీటి తొట్టెలు, నీటి పాత్రల్లో నీళ్లు నింపి అందుబాటులో ఉంచాలన్నారు. ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

వృద్ధుడి అనుమానాస్పద మృతి

సీతారామపురం: స్థానిక ఆరు లేన్ల జాతీయ రహదారి సమీపాన నల్లమేకల వెంగయ్య (63) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శుక్రవారం పోలీసుల వివరాలు వెల్లడించారు. మండలంలోని గుండుపల్లి గ్రామానికి చెందిన వెంగయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండు రోజుల క్రితం ఆయన కట్టెల కోసం అడవికి వెళ్లి తిరిగొస్తుండగా మార్గమధ్యలో దారి తప్పి జాతీయ రహదారి వద్ద నుంచి వస్తూ చనిపోయాడు. మృతదేహానికి కూత వేటు దూరంలో కట్టెల మోపు, గొడ్డలి, ఇనుపరాడ్ ఉన్నాయి. మృతుడి తల, శరీరంపై గాయాలు ఉన్నాయి. దీంతో వెంగయ్య మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కంట్లో కారం చల్లి..

- మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

వెంకటాచలం: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ కంట్లో కారం చల్లి ఆమె మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటన వెంకటాచలం పంచాయతీ పరిధిలోని వడ్డీపాళెంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. వడ్డీపాళేనికి చెందిన ఉప్పు రత్నమ్మ తన నివాసంలో ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి ఆమె కంట్లో కారం చల్లాడు. మెడలో ఉన్న మూడు సవర్ల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో విచారణ వేగవంతం


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని గోపాలపురంలో జరిగిన రైతు మల్లికార్జునరెడ్డి హత్య కేసులో విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఘటనా స్థలాన్ని శుక్రవారం నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో మాట్లాడి హత్యకు గల కారణాలను తెలుసుకున్నామన్నారు. గ్రామస్తులతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడించారు. ఆయన వెంట బుచ్చిరెడ్డిపాళెం ఎస్సై సంతోష్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

కోన అడవుల్లో అస్తిపంజరం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో వాటర్ ఫాల్స్ వద్ద వ్యక్తి అస్తిపంజరాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి దృష్టికి వెళ్లడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించి అస్తిపంజరాన్ని నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఏఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 535 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 535 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు 7,803 మందికి గానూ 7,323 మంది హాజరై 480 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1,058 మందికి గానూ 1,003 మంది హాజరై 55 మంది గైర్హాజరయ్యారు.

కండలేరులో 43.792 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 43.792 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,300, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 75 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

బీపీ.. సైలెంట్ కిల్లర్

- ఒత్తిడితో కూడిన జీవనం, విశ్రాంతి లేమి కారణాలు
- జిల్లాలో 5 లక్షల మంది వరకు రోగులు
- అవగాహన, మంచి ఆహార అలవాట్లతో చెక్

నేడు వరల్డ్ హైపర్‌టెన్షన్ డే



నెల్లూరు(అర్బన్): బీపీ (అధిక రక్తపోటు).. తీవ్ర ఒత్తిడితో కూడిన జీవన విధానం, నిద్రలేమి, జంక్ ఫుడ్, జన్యుపరమైన కారణాలతో ఇది వస్తుంది. ప్రస్తుతం అనేకమంది దీని వల్ల బాధపడుతున్నారు. వైద్యపరిభాషలో హైపర్‌టెన్షన్‌గా పిలిచే ఈ జబ్బును నిర్లక్ష్యం చేస్తే రక్తనాళాలు చిట్లిపోయే ప్రమాదం ఉంది. గుండెపోటు రావొచ్చు. బీపీని నియంత్రణలో ఉంచుకోకుంటే ప్రాణాంతకంగా మారుతుంది. అనేకమందికి బీపీ ఉన్న విషయం కూడా తెలియదు. ఈలోపు ఎక్కువై ఒక్కో దఫా ప్రాణాల మీదకు వస్తుంది. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అని కూడా పిలుస్తుంటారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం మేనెల 17వ తేదీని వరల్డ్ హైపర్‌టెన్షన్ డేగా ప్రకటించింది. అందులో భాగంగా శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బీపీపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించనున్నారు.

సంఖ్య పెరుగుతూ..

జిల్లాలో బీపీ రోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. ఒకప్పుడు 5 శాతంగా ఉంటే నేడు సుమారు 20 శాతానికి చేరింది. వైద్యారోగ్య శాఖ 2023లో పీహెచ్‌సీల పరిధిలో సర్వే చేపట్టి స్క్రీనింగ్ చేయగా 1,01,172 మంది బీపీ బారిన పడినట్టు తేలింది. 2024లో స్క్రీనింగ్ చేయగా 80 వేల మంది ఉన్నట్లు వైద్యశాఖ లెక్క చెప్పింది. సాధారణంగా రోగులు ప్రతి సంవత్సరం పెరుగుతున్నారు. అయితే అధికారులు తగ్గినట్టు చూపడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉంటే జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్, కందుకూరు, కావలి ఏరియా హాస్పిటళ్లు, ఆత్మకూరు జిల్లా ఆస్పత్రితో పాటు 10 సీహెచ్‌సీల పరిధిలో మరో 4 లక్షల మందిపై వరకు బీపీ రోగులు వస్తున్నారు. అంటే జిల్లా జనాభాలో సుమారు 20 శాతం రక్తపోటుతో బాధ పడుతున్నారు.

కారణాలెన్నో..

ప్రస్తుతం అనేకమందిది ఉరుకులు, పరుగుల జీవితం. వ్యాపారస్తులు, ఉద్యోగులు, మార్కెటింగ్ చేసే వారు, ప్రైవేట్ ఉద్యోగులు టార్గెట్‌లు చేరుకోవడానికి పనిఒత్తిడితోనే విధులు నిర్వర్తించాల్సి ఉంది. సరైన నిద్ర లేకపోయినా కూడా ఆ ప్రభావం శరీరంపై పడుతోంది. అధిక ఉప్పు, తగిన శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం వంటి సమస్యలు బీపీకి కారణంగా ఉన్నాయి. అధిక ఉప్పుతో కూడిన ఆహారం వల్ల కూడా రక్తపోటు బారిన పడుతున్నారు.

లక్షణాలను గుర్తించాలి

అధికంగా బీపీ ఉన్నవారికి తలతిరిగినట్టు ఉంటుంది. తీవ్రమైన తలనొప్పి వస్తుంది. ఒక్కోదఫా వాంతులు, తల తిరిగిపోవడం, అలసట, వికారం లాంటి లక్షణాలుంటాయి. బీపీ ఎక్కువైతే కంటిలోని రెటీనాకు రక్త సరఫరా తగ్గి చూపు కోల్పోయే ప్రమాదం ఉంది. ఛాతిలో నొప్పి వచ్చి గుండెపోటుకు గురయ్యే అవకాశాలు ఎక్కువ. రక్తపోటు ఎక్కువగా ఉండేవారికి గురక అధికంగా ఉంటుంది. రాత్రి వేళ తరచూ తలనొప్పి వస్తుంది. కొంతమందిలో ముక్కు నుంచి రక్తం కారుతుంది.

అదుపులో ఉంచాలంటే..

అధిక బరువు లేకుండా చూసుకోవాలి. ఆహారంలో రోజుకు 5 గ్రాముల ఉప్పు కన్నా ఎక్కువ తీసుకోరాదు. గుట్కా, మద్యం, సిగరెట్, బీడీ, చుట్ట అలవాట్లు మానుకోవాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. 30 ఏళ్ల వయసు నిండిన వారు క్రమం తప్పకుండా బీపీని చెక్ చేయించుకోవాలి. రక్తపోటును నియంత్రణలో ఉంచుకోని వారిలో బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. మెదడులో రక్తనాళాలు చిట్లుతాయి. పక్షవాతం బారిన పడొచ్చు. కిడ్నీలు దెబ్బతింటాయి. లివర్ పాడవుతుంది. మెదడుపై బీపీ ప్రభావం వల్ల జ్ఞాపకశక్తి తగ్గిపోయే ప్రమాదం ఉంది.

అవగాహన పెంచుకోవాలి



అధిక రక్తపోటు గురించి ప్రజలు అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలి. బీపీని నియంత్రణలో ఉంచుకుంటే ఆరోగ్యపరంగా ఇబ్బందులుండవు. సక్రమంగా మందులు వాడకపోయినా ప్రమాదమే. యోగా, వ్యాయామం లాంటివి చేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా పలు రకాల అనారోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. బీపీ ఉన్న వారు ప్రతినెలా చెక్ చేయించుకోవాలి.

– డాక్టర్ ఎంవీ రమణయ్య, రామచంద్రారెడ్డి ప్రజా వైద్యశాల

పక్కాగా భూముల రీసర్వే

- సైదాపురం మండలంలో కలెక్టర్ పర్యటన
- వైద్య సిబ్బంది పనితీరుపై అసహనం


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

సైదాపురం: జిల్లాలో భూముల రీసర్వేను పక్కాగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. సైదాపురం మండలంలోని తిప్పిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వే తీరును శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా రికార్డులను చూశారు. రైతులతో మాట్లాడారు. సర్వే చేసే గ్రామాల్లో రెగ్యులర్ వీఆర్వోలను నియమించాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. సర్వేపై పలు ప్రశ్నలు వేశారు. గ్రామంలో మిగులు భూములున్నాయా?, వాటి స్థితిగతులు ఏంటని సర్వేయర్ వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. 255 ఎకరాల మేత పోరంబోకు భూమి ఉందని చెప్పగా కలెక్టర్ స్పందించారు. భూమి లేని నిరుపేదలకు రెండెకరాల చొప్పున పంపిణీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పేదలకు ఆ భూములను కేటాయించడం జరుగుతుందన్నారు. సదరు భూములను కొందరు ఆక్రమించారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులతో ఆనంద్ సమీక్షించారు.

- కలెక్టర్ సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. మందులు పంపిణీ చేయని వైనం వెలుగులోకి రావడంతో అసహనం వ్యక్తం చేశారు. అలాగే రోగుల గదిలో నీళ్లు రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

స్నేహితుడే హంతకుడు

- రియల్టర్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ఆర్థిక విభేదాలే కారణం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కృష్ణకాంత్


మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్ చిత్రంలో ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక విభేదాలతో స్నేహితుడే రియల్టర్‌ను కడతేర్చాడు. తనపై అనుమానం రాకుండా ఉండేందుకు గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారంటూ తప్పుదోవ పట్టించాడు. విభిన్న కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టినా చిన్నపాటి క్లూ దొరకలేదు. దీంతో స్నేహితుడిని మరోమారు తమదైన శైలిలో విచారించగా తానే హత్య చేసినట్లు వెల్లడించడంతో అరెస్ట్ చేశారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో శుక్రవారం ఎస్పీ జి.కృష్ణకాంత్ వివరాలను వెల్లడించారు. ఉదయగిరికి చెందిన గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్నా అలియాస్ ఇస్సాక్ (40) రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నాడు. నాలుగేళ్లుగా అయ్యప్పగుడి పరిధి వెంకటరెడ్డినగర్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని రియల్ ఎస్టేట్‌తోపాటు ప్రభుత్వ ఉద్యోగులకు రుణాలు ఇప్పించేవాడు. ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి చిన్నయ్య ఇంట్లో హత్యకు గురయ్యాడు. ఆ రోజు రాత్రి అతడితోపాటు అదే ఇంట్లో స్నేహితుడైన టీచర్ సరస్వతి వెంకటేశ్వర్లు ఉన్నాడు. 6వ తేదీ ఉదయం చిన్నయ్య హత్యకు గురయ్యాడంటూ మృతుడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలాన్ని నగర డీఎస్పీ పి.సింధుప్రియ, వేదాయపాళెం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జి.రోశయ్య పరిశీలించారు. మృతుడి తమ్ముడు రాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. వెంకటేశ్వర్లును పోలీసులు విచారించగా తాను పడక గదిలో నిద్రించగా, చిన్నయ్య హాల్లో పడుకున్నాడని చెప్పాడు. ఎవరు హత మార్చారో తనకు తెలియదని వెల్లడించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లు పరిశీలించినా చిన్నపాటి ఆధారం దొరకలేదు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో కేసు ముందుకుసాగలేదు.

అందరినీ విచారించి..

చిన్నయ్యకు పలువురితో భూ వివాదాలు, ఆర్థిక విభేదాలున్నాయి. దీంతో తెలిసిన వారే ఈ పని చేసి ఉంటారని భావించారు. మృతుడితో విభేదాలున్న వారిని పోలీసులు విచారించినా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. కేసు సవాలుగా మారడంతో ఎస్పీ స్వయంగా రంగంలోకి దిగారు. ఇన్‌స్పెక్టర్లు రోశయ్య, సీహెచ్ సీతారామయ్య తదితరులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పర్యవేక్షించారు. మరోమారు పోలీసులు విచారించినా క్లూ దొరకలేదు. వెంకటేశ్వర్లును విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పడం, అతడి తీరు అనుమానాస్పదంగా ఉండటంతో తమదైన శైలిలో విచారించగా హత్య జరిగిన తీరు వెలుగులోకి వచ్చింది.

మోసాన్ని తట్టుకోలేక..

చిన్నయ్య పలువురికి ప్రైవేట్ ఫైనాన్స్‌లు, బ్యాంకుల్లో రుణాలిప్పించి అందుకు కమీషన్ తీసుకుంటుండేవాడు. వెంకటేశ్వర్లును పలువురికి ష్యూరిటీగా పెట్టాడు. ఈక్రమంలోనే వెంకటేశ్వర్లు పేరుపై రూ.లక్షల్లో రుణం తీసుకుని ఎగ్గొట్టారు. పలువురు రుణాలు కట్టకపోవడంతో అతడికి వివిధ బ్యాంక్‌లు, ఫైనాన్స్ కంపెనీల నుంచి నోటీసులు వచ్చాయి. దీంతో వెంకటేశ్వర్లు చిన్నయ్యను నిలదీయగా సరైన సమాధానం చెప్పేవాడు కాదు. వెంకటేశ్వర్లు అప్పుల ఊబిలో కూరుకుపోయి చిన్నయ్యపై కక్ష పెంచుకుని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. పక్కా పథకంతో తన సెల్‌ఫోన్‌ను పడారుపల్లిలోని తన ఇంట్లోనే ఉంచి చిన్నయ్య దగ్గరికొచ్చాడు. ఇద్దరూ కలిసి మెడికల్ షాపునకు వెళ్లి మందులు తీసుకొచ్చారు. తర్వాత చిన్నయ్య హాల్లో నిద్రపోగా, వెంకటేశ్వర్లు పడకగదిలోకి వెళ్లాడు. కొద్దిసేపటి అనంతరం వెంకటేశ్వర్లు ఇంట్లో ఉన్న డంబెల్‌తో చిన్నయ్య ముఖంపై పలుమార్లు కొట్టాడు. కొన ఊపిరి ఉండగా దిండుతో ముఖంపై బలంగా నొక్కి హత్య చేశాడు. ఆధారాలు దొరక్కుండా ఆ ప్రాంతంలో కారం చల్లాడు. శుక్రవారం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు వార్డులు అందజేశాడు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 130
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 260
లేయర్ చికెన్ : 187

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.90
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30



70 డ్రమ్ముల కోళ్ల వ్యర్థాల పట్టివేత


వ్యర్థాల పూడ్చివేతకు తవ్విన గుంత

సంగం: మండల కేంద్రమైన సంగంలోని కావలి కాలువ సమీపంలోని ధాబా వద్ద చికెన్ వ్యర్థాల వాహనాన్ని శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటక నుంచి నిత్యం ఐదు నుంచి పది వాహనాల్లో సంగం మండలంలోని పడమటిపాళెం, వంగల్లు, కోలగట్ల, వెంగారెడ్డిపాళెం, సిద్దీపురం, జెండాదిబ్బ, దువ్వూరు తదితర ప్రాంతాలకు చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నారు. వేల ఎకరాల్లో సాగవుతున్న చేపలకు వాటిని వేస్తున్నారు. గురువారం రెండు లారీలను పట్టుకోగా శుక్రవారం సాయంత్రం మరో పెద్ద వాహనంలో 70 డ్రమ్ముల్లో ఉన్న వ్యర్థాలను పట్టుకున్నారు. వాటిని సంగం కొండమలుపులో భారీ గుంత తీసి పూడ్చివేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. లారీ యజమాని, డ్రైవర్, కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

‘టాపర్’ కోసం తప్పుడు మార్గం

- ఇంటర్ జవాబు పత్రాలు ట్యాంపరింగ్
- ఇతర కాలేజీల్లోని టాపర్ విద్యార్థులే టార్గెట్
- రీ వాల్యుయేషన్‌లో బయటపడిన బండారం
- కరెక్ట్‌గా రాసిన ఇద్దరు విద్యార్థుల సమాధానాలు కొట్టివేత
- ఇన్విజిలేటర్, పరీక్ష కేంద్రంపై ఇంటర్ బోర్డు విచారణకు ఆదేశం

కందుకూరు రూరల్: కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు వారి ర్యాంక్‌లు పెంచుకునేందుకు పక్క కళాశాలల విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. ఇంటర్మీడియట్‌లో మార్కులు తక్కువగా వచ్చాయని ఓ విద్యార్థి రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఈ విషయం బట్టబయలైంది. దీంతో అనుమానం వచ్చి మరో విద్యార్థి జవాబుపత్రాలను కూడా పరిశీలిస్తే పక్కాగా టాంపరింగ్ జరిగినట్లుగా బోర్డు అధికారులు తేల్చారు. వివరాలు.. ఎం.అవినాష్‌బాబు అనే విద్యార్థి కందుకూరులోని శ్రీ గాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. మొదటి సంవత్సరంలో 464 మార్కులు వచ్చాయి. ఇంగ్లిష్‌లో 100కి 96 మార్కులు వచ్చాయి. సీనియర్ ఇంటర్ పరీక్షలను శ్రీ వివేకా జూనియర్ కళాశాలలో రాశాడు. ఇంగ్లిష్‌లో 80 మార్కులు మాత్రమే వచ్చాయి. మార్కులు తగ్గడంతో రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. అవినాష్ ఈ-మెయిల్‌కు జవాబుపత్రాలను పంపించారు. రోమన్ అంకె 16లో (జత పరచడం) ఐదు ప్రశ్నలకు సరిగ్గా రాసిన సమాధానాలను ఎవరో తప్పుగా దిద్దినట్లు గుర్తించి విస్తుపోయాడు. నిబంధనల ప్రకారం జవాబుపత్రంలో కొట్టివేతలు, దిద్దడం జరిగితే విద్యార్థితో ‘నా చేత కొట్టివేయబడింది’ అని స్వయంగా రాయించి, ఇన్విజిలేటర్ సంతకం చేయాలి. కానీ తాను అసలు దిద్దలేదని అవినాష్‌బాబు కళాశాల అధ్యాపకుల దృష్టికి తీసుకెళ్లాడు. ఎవరో కావాలనే దిద్ది ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు కళాశాల యాజమాన్యం భావించి ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేసింది. జవాబుపత్రాలను పరిశీలించిన బోర్డు అధికారులు కూడా ఆశ్చర్యపోయారు. ఇదే కళాశాలకు చెందిన తన్నీరు సాయి తేజస్విని జూనియర్ ఇంటర్‌లో 470కి 466 మార్కులు సాధించింది. ఇంగ్లిష్‌లో 97 మార్కులు వచ్చాయి. సీనియర్ ఇంటర్ ఇంగ్లిష్‌లో 88 మార్కులే వచ్చాయి. అనుమానం వచ్చి అధికారులు కమిషనర్‌కు విషయం తెలియజేయడంతో ప్రత్యేక అనుమతులతో తేజస్విని జవాబుపత్రాన్ని తెప్పించి పరిశీలించగా, ఆ ఐదు ప్రశ్నలను దిద్దిఉన్నట్లు గమనించారు. దీంతో ఇది కచ్చితంగా ట్యాంపరింగ్‌గా నిర్ధారిస్తూ ఇన్విజిలేటర్‌పై, పరీక్ష కేంద్రమైన శ్రీ వివేకా జూనియర్ కాలేజీపై విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. ఏ విద్యాసంస్థ ఇలా చేయించిందన్నది తెలిసినా, దాన్ని బయటకు ప్రకటిస్తారా.. లేక తొక్కి పెడతారో వేచి చూడాలి. కాగా, తన్నీరు తేజస్విని పేద విద్యార్థిని. డబ్బుల్లేక రీ వాల్యుయేషన్ పెట్టుకోలేదు. తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

ఇది దుర్మార్గం

ఇంగ్లిష్ పరీక్ష బాగా రాశాను. కానీ మార్కులు బాగా తగ్గడంతో రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేశాను. బోర్డు అధికారులు ట్యాంపరింగ్ జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. మార్కులు తగ్గడంతో మంచి యూనివర్సిటీలో సీటు వచ్చే అవకాశాన్ని కోల్పోయాను. మా జీవితాలను నాశనం చేయాలనుకోవడం దుర్మార్గం.

– పి.అవినాష్‌బాబు, విద్యార్థి

డబ్బుల్లేక దరఖాస్తు చేయలేదు

సీనియర్ ఇంటర్ ఇంగ్లిష్‌లో మార్కులు బాగా తగ్గాయి. రీ వాల్యుయేషన్‌కు ఫీజు చెల్లించలేక వదిలేశాను. అవినాష్‌కు ఇలానే జరగడంతో కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో నా పేపర్లు తీసి చూశారు. యూనివర్సిటీలో సీటు కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఇన్విజిలేటర్ ఇదంతా చేశారని అనుమానంగా ఉంది. నాకు న్యాయం చేయాలి.

– తన్నీరు తేజస్విని, విద్యార్థిని